

త్వరలోనే కల్వర్టు నిర్మాణం పూర్తి

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని వంకవారి గూడెంలో వంతెన నిర్మాణం కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోవడంతో ఆ ప్రాంతాన్ని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు మంగళవారం పరిశీలించారు. ఈ మార్గంలో రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.35 లక్షలు కల్వర్టు నిర్మాణానికి కేటాయించినట్లు తెలిపారు. త్వరలోనే నిర్మాణం పూర్తి చేస్తారన్నారు.



ఇళ్లలోకి చేరిన నీరు

పోలీసుల్లో నిర్వేదం..!

- సమస్యలను పరిష్కరించని ప్రభుత్వం
- ఏడాదిన్నర గడిచినా వీక్లీఆఫ్ ఊసే కరువు
- నాలుగు సరెండర్ లీవుల సొమ్ముల్లో ఒక్కటే చెల్లింపుపై మండిపాటు
- భద్రతా హౌస్‌లోన్ కోసం పడిగాపులు
- ఏడాదిగా ఇవ్వని టిఎ బిల్లులు
- డిప్యూటీ సిఎం పవన్ ఇచ్చిన మాట మర్చిపోయారని ఆవేదన
- రెండు జిల్లాల్లో మూడు వేల మందికిపైగా పోలీస్ సిబ్బంది



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా కూటమి ప్రభుత్వ తీరుపై పోలీసుల్లో తీవ్ర చర్చ సాగుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఏఒక్కటీ అమలు చేయకుండా వంచిస్తున్న తీరుపై పోలీస్ సిబ్బందిలో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. తాను పోలీస్ కానిస్టేబుల్ కుమారుడినని, కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక పోలీసుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ నోరు మెదపకపోవడంపై పోలీస్ సిబ్బందికి తీవ్ర ఆగ్రహం తెప్పిస్తోంది. దీంతో ప్రభుత్వం తమను వంచించిందనే అభిప్రాయం పోలీస్ సిబ్బందిలో నెలకొంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో మూడు వేల మందికిపైగా పోలీస్ సిబ్బంది పని చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం పోలీసులకు ఇవ్వాల్సిన సరెండర్ లీవ్స్ సొమ్ము, వీక్లీఆఫ్ అమలు, భద్రతా హౌస్‌లోన్లు, టిఎ బిల్లులు వంటివి ఇవ్వకుండా తీవ్ర ఇబ్బంది పెట్టింది. తాము అధికారంలోకి వస్తే పోలీసులకు అన్నివిధాలా న్యాయం చేస్తామని సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ భరోసా ఇచ్చారు. అధికారంలోకొచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా పోలీసులను కనీసం పట్టించుకోని పరిస్థితి నెలకొంది. పోలీసులకు ప్రతి నాలుగు నెలలకు ఒకసారిగా 15 రోజుల వేతనం అదనంగా ఇవ్వడం జరుగుతోంది. వీటిని సరెండర్ లీవ్స్ అంటారు. కూటమి అధికారంలోకి వచ్చాక నాలుగు సరెండర్ లీవ్స్ బకాయిలు ఉన్నాయి. నవంబర్ కూడా పూర్తయితే సరెండర్ లీవ్స్ ఐదుకు చేరతాయి. దీపావళికి ముందు రోజు ఉద్యోగులకు ఏదో అద్భుతం చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అందులో ఒక సరెండర్ లీవ్స్‌కు సంబంధించిన సొమ్మును నవంబర్‌లో సగం, జనవరంలో సగం ఇవ్వనున్నట్లు తెలిపింది. అంటే సరెండర్ లీవ్ సొమ్ము రూ.30 వేలు అనుకుంటే రూ.15 వేలు ఒకసారి, మరోసారి రూ.15 వేలు ఇస్తారన్నమాట. నాలుగు సరెండర్ లీవుల సొమ్ముకు ఒకటిస్తూ అదీ రెండువిడతలుగా ఇస్తానని చెప్పడంపై పోలీస్ సిబ్బందిలో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. ఇదేం దారుణమని పోలీస్ సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. టిఎ (రవాణా ఖర్చులు) కింద పోలీస్ సిబ్బందికి ప్రతినెలా రూ.2,250 ఇవ్వాల్సి ఉంటుంది. ఎస్ఐ, ఆపై అధికారులకు ఇది రూ.4,500 వరకూ ఉంది. ఏడాదిగా టిఎ బకాయిలుసైతం ఇవ్వడం లేదని పోలీసులు గగ్గోలు పెడుతున్నా ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి.

వీక్లీఆఫ్ ఊసే లేదు

పోలీస్ ఉద్యోగం సమయంతో సంబంధం లేకుండా పని చేయాల్సి ఉంటుంది. తిండి సైతం సమయానికి తినలేని పరిస్థితి. సిఎం, వివిఐపిల బందోబస్తుల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. దీంతో పోలీసులు తీవ్రమైన పని ఒత్తిడికి గురవుతున్నారని, తాము అధికారంలోకి వస్తే వీక్లీఆఫ్ అమలు చేస్తామని కూటమి చెప్పింది. ఏడాదిన్నర గడిచినా ఇప్పటివరకూ వీక్లీఆఫ్ ఊసే లేకుండాపోయింది. దీంతో సిబ్బందిపై పని ఒత్తిడి పెరిగి అనారోగ్యం పాలవుతున్నారు. గత వైసిపి ప్రభుత్వం వీక్లీఆఫ్ విషయంలో ఇదేవిధంగా మోసం చేసింది. అధికారంలోకి వచ్చే వరకూ ఒకలా.. వచ్చిన తర్వాత మరోలా వ్యవహరించడం పాలకులకు అలవాటుగా మారిపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీస్ సిబ్బంది ఇంటి నిర్మాణం చేసుకుంటే భద్రతా లోన్ ఇస్తారు. దీనికి దరఖాస్తు చేసుకున్నా కళ్లుకాయలు కాసేలా ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో పోలీసుల్లో ప్రభుత్వం తీరుపై తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది.

పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలి

నివాళులర్పించాల్సిన బాధ్యత అందరిది

సంస్మరణ దినంలో ఐజి అశోక్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

శాంతిభద్రతల పరిరక్షణలో తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరులకు నివాళు లర్పించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఏలూరు రేంజ్ ఐజి జివిజి.అశోక్ కుమార్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా ఏలూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో మంగళవారం కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పి కె.ప్రతాప్ శివకిషోర్‌తో కలిసి ఐజి అశోక్‌కుమార్ అమర వీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచమంతా గాఢ నిద్రలో ఉంటే పోలీసు మేల్కొని శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తుంటారన్నారు. ఎండ, వాన, పగలు, రాత్రి అనే తేడా లేకుండా కుటుంబంతో కలిసి జరుపుకునే పండుగలను త్యజించి విధి నిర్వహణ చేస్తుంటారన్నారు. వారి త్యాగాన్ని గౌరవించడం మనందరి బాధ్యతన్నారు. పోలీసు అమర వీరుల సేవలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు తమ శాఖ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. పోలీసు అమర వీరుల కుటుంబాలు సమస్యలుంటే తమకు తెలియజేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో అలుపెరుగని కృషి చేస్తున్న పోలీసులు రియల్ హీరోస్ అని వారి త్యాగాలను కొనియాడారు. జిల్లా ఎస్పి కె.ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించడం మనందరి బాధ్యతన్నారు. పోలీసు సిబ్బంది కవాతుకు కమెండర్‌గా ఎఆర్ ఆర్ఐ సతీష్ అమర వీరుల స్మృతి పెరేడ్ నిర్వహించారు. అనంతరం పోలీసు అమరవీరుల త్యాగాలను తెలియజేస్తూ ఏలూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నుండి నిర్వహించిన ర్యాలీని ఐజి అశోక్ కుమార్, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్పి కె.ప్రతాప్ శివ కిషోర్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ అమీనాపేట, ప్రభుత్వాసుపత్రి, ఫైర్ స్టేషన్, జెడ్‌పి ఆఫీస్, కలెక్టరేట్ మీదుగా తిరిగి పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌కు చేరుకుంది. కార్యక్రమంలో ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, డిటిసి డిఎస్‌పి ప్రసాదరావు, ఎఆర్ డిఎస్‌పి చంద్రశేఖర్, ఎఒ మస్తాన్, ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణ, అశోక్‌కుమార్, కోటేశ్వరరావు, పవన్‌కుమార్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న అధికారులు

ధాన్యం కొనుగోలులో రైతు ఇబ్బంది పడకూడదు

4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు పటిష్ట ప్రణాళిక

జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్‌గౌడ

ప్రజాశక్తి - పెదపాడు

వట్లూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, సత్యకృష్ణ మోడ్రన్ రా అండ్ బాయిల్డ్ రైస్‌మిల్లును జిల్లా జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్‌గౌడ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం జల్లెడ, ధాన్యం నాణ్యత, గోనె సంచులు, తేమ శాతం కొలిచే యంత్రాన్ని, డిజిటల్ వేయింగ్ స్కేల్ (తూనిక యంత్రాలు)ను పరిశీలించి, పని చేసే విధానాన్ని స్వయంగా పరిశీలించారు. కొన్ని వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైసుమిల్లుకు వెళ్లి మిల్లులో మిషనరీ డ్రయ్యర్లు, ధాన్యం నుండి బియ్యం తయారయ్యే యంత్రాలను స్వయంగా పరిశీలించారు. రైస్‌మిల్లు యజమాని ఆళ్ల సతీష్‌చౌదరి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు జిల్లాలో సుమారు 105 రైసుమిల్లులు ఉన్నాయని, అందరూ ధాన్యం కొనుగోలులో రైతు సోదరులకు తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి మరింత వేగవంతం చేసి ఏలూరు జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచేలా రైస్‌మిల్లర్స్ తరపున సహకరిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్‌గౌడ మాట్లాడుతూ జిల్లాలో 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు లక్ష్యమవ్వగా, అందుకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. రైతులకు ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియకు పక్కా ఏర్పాట్లు చేశామన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని చిన్న చిన్న పొరపాట్లు ఏమైనా ఉంటే సరిచేసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. రైతుల నుండి ధాన్యం సేకరించిన 24 గంటల్లోనే వారి ఖాతాకు నగదు జమ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ధాన్యం సేకరించాలని, ధాన్యం సేకరణ, మిల్లులకు తరలింపు, రైతులకు డబ్బు చెల్లింపు విషయంలో అన్నదాతలకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ధాన్యం సేకరణలో రైతుల ఇబ్బందులు, సమస్యలను తెలుసుకునేందుకు కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామని, కంట్రోల్ రూమ్ నెంబరు: 7702003584, ఏలూరు జిల్లా టోల్‌ఫ్రీ నెంబరు 18004256453కు రైతులు తమ సమస్యలు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో డిఎస్ఒ విలియమ్స్, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ పి.శివరామ్మూర్తి, వ్యవసాయ శాఖ జెడి షేక్ హబీబ్‌భాషా, డిసిఒ ఆరిమిల్లి శ్రీనివాస్, తహశీల్దార్ ఎ.కృష్ణజ్యోతి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఇ.అనిల్‌కుమారి, టెక్నికల్ అసిస్టెంట్లు, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.



రైస్‌మిల్లర్స్‌తో మాట్లాడుతున్న జెసి అభిషేక్‌గౌడ

ట్రంప్ సుంకాలతో వ్యవసాయ రంగం దివాళా

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకించాలి

వ్యకాస ఆధ్వర్యాన ట్రంప్ దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అమెరికా సామ్రాజ్యవాద అధిపతి ట్రంప్ వ్యవసాయ ఉత్పత్తులపై విధించిన సుంకాలను నిరసిస్తూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బాబూజగ్జీవన్‌రావు విగ్రహం వద్ద మంగళవారం ట్రంప్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ రంగం, పాడి, ఎగుమతి చేసే ఉత్పత్తులపై 11 నుంచి 50 శాతం మేర ట్రంప్ విధించిన సుంకాల వల్ల వ్యవసాయ రంగం దివాళా తీసి వ్యవసాయ కార్మికులు ఉపాధి కోల్పోయి వలసలు వెళ్లాల్సి వస్తుందన్నారు. ఈ విధానాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కనీసం ప్రశ్నించకపోవడం దేశ ప్రజలను అవమానించడమేనన్నారు. భారత్, ఇతర దేశాల నుంచి అమెరికాకు దిగుమతులపై సుంకం 50 నుంచి వంద శాతానికి పెంచడం దుర్మార్గమన్నారు. జిల్లాకు సంబంధించి ఆక్వా ఉత్పత్తులు, పత్తి, మెడిసిన్‌కు సంబంధించిన ఉత్పత్తులపై సుంకం పెంపు తీరని నష్టమన్నారు. మోడీ ప్రభుత్వానికి రాష్ట్రంలోని కూటమి నాయకులు, ప్రభుత్వం భజన బృందంగా మారిందని విమర్శించారు. ఇప్పటికైనా దేశంలోని రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికుల పట్ల చిత్తశుద్ధితో ప్రభుత్వాలు ట్రంప్ సుంకాలను వ్యతిరేకిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ప్రజలు తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, నాయకులు జి.వెంకట్రావు, తామా ముత్యాలమ్మ, వై.నాగేంద్రరావు, ఎస్.మహంకాళి, కె.దుర్గ, యు.వెంకటేష్, యాగంటి సీత, డి.రవీంద్ర, ఎం.వీర్రాజు, మాధవ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



ట్రంప్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నేతలు

మాస్టార్ మాటిచ్చారు..విమానం ఎక్కించారు..!

తెలుగులో నూటికి నూరు మార్కులు వస్తే విమానం ఎక్కిస్తానని విద్యార్థులకు మాట

ఇచ్చిన మాట నెరవేర్చిన పెదనిండ్రకొలను హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయులు షేక్ మౌలాలి

ప్రజాశక్తి - నిడమర్రు

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో తెలుగులో నూటికి నూరు మార్కులు తెచ్చుకుంటే విమానం ఎక్కిస్తాను అంటూ విద్యార్థులకు ఇచ్చిన మాటను మాస్టార్ నిలబెట్టుకున్న ఘటన మండలంలోని పెదనిండ్రకొలను హైస్కూల్‌లో చోటుచేసుకుంది. అదే స్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయునిగా పని చేస్తున్న షేక్ మౌలాలి విద్యార్థులకు ఇచ్చిన మాట ప్రకారం తెలుగులో నూటికి నూరు మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులను గన్నవరం నుంచి విమానంలో హైదరాబాద్ తీసుకెళ్లడంతో ఆ విద్యార్థుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. తాను చదువు చెప్పే విద్యార్థులను పైకి తీసుకురావాలనే సంకల్పంతో తెలుగు మాస్టార్ మౌలాలి వినూత్న ఆలోచనలకు శ్రీకారం చుట్టారు. మూడేళ్లుగా పదో తరగతి పరీక్షల్లో తెలుగులో అత్యధిక మార్కులు సాధించిన వారిని తనదైన రీతిలో ప్రోత్సహిస్తున్నారు. మొదటి ఏడాది తెలుగులో 98 మార్కులు టార్గెట్‌గా విధించి సాధించిన విద్యార్థులకు బ్యాగ్‌లు, మెమెంటోలు అందించారు. రెండో ఏడాది 99 మార్కుల లక్ష్యం విధించి సాధించిన విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు. 2025 పబ్లిక్ పరీక్షల్లో తెలుగులో నూటికి నూరు మార్కులు సాధించిన విద్యార్థులను విమానం ఎక్కిస్తానని మౌలాలి మాటిచ్చారు. ఎంతో కష్టపడి చదవి ఆ మార్కులు సాధించి, ప్రస్తుతం ఇంటర్ చదువుతున్న నిమ్మల పావని, నిమ్మల సత్యసాహితీలను ఇచ్చిన మాట ప్రకారం తన సొంత ఖర్చులతో గడిచిన శనివారం గన్నవరం విమానాశ్రయానికి తీసుకెళ్లి, అక్కడ నుంచి విమానంలో హైదరాబాద్ తీసుకెళ్లారు. విమానం ఎక్కాలనే కల నెరవేరడంతో విద్యార్థుల సంతోషానికి అవధులు లేకుండాపోయాయి. అంతేకాకుండా శని, ఆదివారాల్లో వారికి చార్మినార్, ట్యాంక్‌బండ్, సాలార్జంగ్ మ్యూజియం, హైటెక్ సిటీ వంటి ప్రముఖ ప్రాంతాలను చూపించి తీసుకొచ్చారు. విద్యార్థులకిచ్చిన మాట నిలబెట్టుకున్న ఉపాధ్యాయులు మౌలాలిని పలువురు ప్రశంసిస్తున్నారు.



గన్నవరం విమానాశ్రయంలో విద్యార్థులతో మాస్టారు మౌలాలి

ముదినేపల్లిలో కుండపోత వాన

- ఇళ్లల్లోకి, కాలనీల్లోకి చేరిన నీరు
- జనం అవస్థలు
- ఇళ్లల్లోకి ప్రవేశిస్తున్న పాములు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో మంగళవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. రెండు దఫాలుగా కురిసిన వర్షంతో గ్రామాల్లోని అంతర్గత రోడ్లు, ఆర్అండ్‌బి రహదారులు జలమయం అయ్యాయి. డ్రెయినేజీలు పొంగి రోడ్లపైకి నీరు భారీగా చేరింది. దీంతో రోడ్లపై రాకపోకలు సాగించేందుకు ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. విడవకుండా రెండు గంటల పాటు కురిసిన వర్షంతో గ్రామాల్లో రోడ్లన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. పల్లపు ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పల్లపు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరి ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. పల్లపు ప్రాంతాల్లోని కాలనీలోని ఇళ్లల్లోకి నీరు చేరడంతో గృహోపకరణాలు తడిసిపోయాయి. పలు గ్రామాల్లో ఇంటి ఆవరణల్లో నీరు నిలిచిపోయింది. దీంతో నివాసితులు ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు నానాయాతన పడ్డారు. వర్షంతో ముదినేపల్లి సెంటర్ చిత్తడి చిత్తడిగా మారింది. సెంటర్ అంతా గోతులతో ఉండడంతో గోతుల్లో వర్షపు నీరు చేరి దారి కనపడగా ద్విచక్రవాహనదారులు తికమక పడ్డారు. బస్టాండ్ సెంటర్, గురజ రోడ్డు వర్షపు నీటితో నిండిపోయింది. వర్షం కారణంగా రోడ్లన్నీ జలమయం కావడంతో పాఠశాలలు, కళాశాలల నుంచి ఇళ్లకు చేరుకునేందుకు విద్యార్థులు నానా ఇబ్బందులు పడ్డారు. వర్షానికి ఊర చెరువులు నిండిపోయి నీరు రోడ్లపై చేరింది. పలుచోట్ల వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరడంతో పాములు, విష పురుగులు ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని జనం గగ్గోలు పెడుతున్నారు. వర్షానికి చేవూరు కాలనీలో పొన్నూరు సుబ్బారావు ఇంట్లోకి మూడు పాములు ప్రవేశించడంతో వాటిని కొట్టి చంపినట్లు సుబ్బారావు తెలిపారు. ముదినేపల్లి అంబేద్కర్ నగర్, తదితర గ్రామాల్లో కూడా పాములు ఇళ్లలోకి రావడంతో జనం ప్రాణభయంతో బిక్కుబిక్కు మంటున్నారు. వర్షాలకు చెరువులు నిండి నీరు ఇళ్లలోకి చేరడంతో పాములు ఇళ్లల్లోకొస్తున్నట్లు జనం చెబుతున్నారు.



ఇళ్లలోకి చేరిన నీరు

కొబ్బరి చెట్టు పడి ఇల్లు ధ్వంసం

భీకర గాలివానకు కొబ్బరి చెట్టు విరిగి ఇంటిపై పడి ఇల్లు ధ్వంసమైన సంఘటన మంగళవారం మధ్యాహ్నం మండలంలోని కాకరవాడలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జోగి శ్రీనివాసరావు ఇంటి ఆవరణంలో ఉన్న కొబ్బరి చెట్టు మధ్యాహ్నం వేసిన బీకర గాలి వానకు విరిగి ఇంటిపై పడింది. ఈ ప్రమాదంలో ప్రాణాపాయం ఏమి జరగనప్పటికీ, ఇంటి పైకప్పు రేకులన్నీ ధ్వంసం అయ్యాయి. ఇంట్లోని గృహోపకరణాలు దెబ్బతిన్నాయి. ఈ సమాచారం విఆర్ఒ ఏడుకొండలు తహశీల్దార్‌కు తెలిపారు. ఈ ప్రమాదంలో రూ.50 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.



ఇంటిపై పడిన కొబ్బరి చెట్టు

సెటిల్‌మెంట్ కింగ్ ఆ డిఎస్‌పి..!

- డిప్యూటీ సిఎంకు చేరిన భీమవరం డిఎస్‌పి అవినీతి వ్యవహారం
- జూదం, సివిల్ తగాదాల్లో భారీగా అవినీతి ఆరోపణలు
- నెలకు రూ.25 లక్షలకుపైగా దండుకుంటున్నట్లు చర్చ
- జిల్లా ఎస్‌పితో ఫోన్‌లో మాట్లాడిన పవన్‌కల్యాణ్
- డిఎస్‌పి వ్యవహారంపై సిఎం చంద్రబాబు సీరియస్
- ఎంఎల్‌ఎల కనుసన్నల్లోనే అంతా అని ప్రచారం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం డిఎస్‌పి రావూరి జైసూర్య సెటిల్‌మెంట్ కింగ్‌గా తయారయ్యారని, జూదం, సివిల్ తగాదాల సెటిల్‌మెంట్లను నిర్వహిస్తూ భారీగా అవినీతికి పాల్పడుతున్నారని ఆ ప్రాంత కూటమి నేతలు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేయడం, ఆయన జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీకి మంగళవారం ఫోన్ చేసి మాట్లాడటం చర్చనీయాంశమైంది. ఆ వెంటనే హోం మంత్రి, డిజిపి దృష్టికి డిప్యూటీ సిఎం కార్యాలయ అధికారులు తీసుకెళ్లారు. ఈ విషయం సిఎం చంద్రబాబు దృష్టికి చేరడంతో హోం మంత్రి, డిజిపితో ఆయన డిఎస్‌పి వ్యవహారంపై చర్చించడం హాట్‌టాపిక్‌గా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పేకాట, కోడిపందేలు విచ్చలవిడిగా సాగుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులు భారీగా మామూళ్లు తీసుకుని ఈ వ్యవహారం సాగిస్తున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. తాజాగా భీమవరం డిఎస్‌పి జైసూర్య వ్యవహారం డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ వరకూ చేరడంతో జూదం, సివిల్ తగాదాల సెటిల్‌మెంట్ల వ్యవహారం గుప్పుమంటుంది. ప్రస్తుత భీమవరం డిఎస్‌పి జైసూర్య గతంలో భీమవరం టుటౌన్, రూరల్ సర్కిల్ ప్రాంతాల్లో సిఐగా పని చేశారు. దీంతో ఆ ప్రాంత నాయకులతోపాటు అక్కడి వ్యవహారాలపై ఆయనకు పూర్తి అవగాహన ఉంది. భీమవరం డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జూదం, సెటిల్‌మెంట్లకు సంబంధించి మరింత రెచ్చిపోయినట్లు తెలుస్తోంది. భీమవరంలో మూడు క్లబ్‌లు ఉన్నాయి. వీటితోపాటు పలు అపార్ట్‌మెంట్లలోనూ, ఉండి, కాళ్ల, భీమవరం రూరల్ మండలాల ప్రాంతంలోనూ పెద్దఎత్తున పేకాట క్లబ్‌లు, కోడిపందేల నిర్వహణను డిఎస్‌పి ప్రోత్సహిస్తున్నట్లు చెబుతున్నారు. సివిల్ తగాదాల్లో జోక్యం చేసుకుని సెటిల్‌మెంట్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. డిఎస్‌పికి ఆ ప్రాంత ఎంఎల్‌ఎల మద్దతు కూడా ఉందని, దీంతో మరింత రెచ్చిపోతున్నట్లు చర్చ సాగుతోంది. డిఎస్‌పికి నెలకు మామూళ్ల రూపంలో రూ.25 లక్షలుపైనే అందుతున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. దీనిపై భీమవరం ప్రాంతంలో కొంతకాలంగా తీవ్రమైన చర్చ సాగుతున్నప్పటికీ ఇప్పటికి బయటికొచ్చింది.

డిప్యూటీ సిఎం జోక్యంతో వ్యవహారం బట్టబయలు

భీమవరం డిఎస్‌పి జైసూర్య సెటిల్‌మెంట్ల వ్యవహారంపై కొంతమంది కూటమి నేతలు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో ఆయన మంగళవారం జిల్లా ఎస్‌పి నయీంతో ఫోన్‌లో మాట్లాడారు. పవన్ ఫిర్యాదును సిఎం చంద్రబాబు సీరియస్ తీసుకుని, హోంమంత్రి, డిజిపితో సమావేశమై చర్చించినట్లు తెలిసింది. దీనిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని జిల్లా ఎస్‌పిని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో డిఎస్‌పిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారోననే చర్చ సాగుతోంది. ఎంఎల్‌ఎల కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతుందని, ఆయన్ని కాపాడేందుకు ఎంఎల్‌ఎలు ప్రయత్నించనున్నట్లు చర్చ నడుస్తోంది. ప్రభుత్వం ఏవిధంగా ముందుకు సాగుతుందో వేచి చూడాలి. భీమరంలోనే కాకుండా రెండు జిల్లాల్లోనూ జూదం విచ్చలవిడిగా సాగుతోంది. ప్రభుత్వం దృష్టి సారించాలని అంతా కోరుతున్నారు.

విచారణ చేసి నివేదిక ఇస్తాం

నయీం అస్మీ, జిల్లా ఎస్‌పి, పశ్చిమగోదావరి జిల్లా

భీమవరం డిఎస్‌పి జైసూర్యపై వచ్చిన ఆరోపణలపై డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ మాట్లాడారు. విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. విచారణ చేసి నివేదిక ఇస్తాం.

నేడు సంతకాల సేకరణ : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పిపిపి విధానాన్ని వ్యతిరేకిస్తూ, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సౌకర్యాలు మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో 22వ తేదీ బుధవారం ఉదయం 9:30 గంటలకు ప్రభుత్వాసుపత్రి వద్ద సంతకాల సేకరణ, నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నగర కార్యదర్శి పంపన రవికుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగాన్ని కార్పొరేటీకరణ చేసేందుకే పిపిపి విధానాన్ని తీసుకొస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే సామాన్యులకు సరైన వైద్యం అందడం లేదని, ప్రభుత్వ ఆసుపత్రులు సమస్యల పరిధిలో అసౌకర్యాలతో కొట్టుమిట్టాడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలను సమీకరించి ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేటుపరం కాకుండా అడ్డుకుంటామని తెలిపారు. కార్యక్రమాన్ని జిల్లా ప్రభుత్వాసుపత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య ప్రారంభిస్తారని, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, జిల్లా కార్యదర్శి ఎ.రవి పాల్గొంటారని పేర్కొన్నారు.

జూడో, స్కేటింగ్ జిల్లాస్థాయి ఎంపికలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జూడో, స్కేటింగ్ జిల్లాస్థాయి ఎంపికలు మంగళవారం స్థానిక ఇండోర్ స్టేడియం మైదానంలో జరిగాయి. 14 సంవత్సరాల్లోపు, 17 సంవత్సరాల్లోపు విభాగాల్లో బాలురకు, బాలికలకు జూడో పోటీలు జరిగాయి. జిల్లాలోని వివిధ యాజమాన్యాల పాఠశాలల నుంచి సుమారు 100 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.అలివేలు మంగ, జిల్లా కోఆర్డినేటర్ పద్మలత, ఫిజికల్ డైరెక్టర్లు రవిబాబు, కృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇండోర్ స్టేడియం మైదానంలో ఉన్న స్కేటింగ్ రింక్‌లో 11, 14, 17 సంవత్సరాల విభాగాల్లో బాల బాలికలకు స్కేటింగ్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయి ఎంపికలు జరిగాయి. వివిధ పాఠశాలల నుంచి సుమారు 50 మంది పాల్గొన్నారు. స్కేటింగ్ కోచ్ ఎస్‌కె.ఖాసీం, ఫిజికల్ డైరెక్టర్లు కె.మాధవీలత, పిఎల్.నాయుడు, జె.మల్లేశ్వరిదేవి పాల్గొన్నారు.



జూడో పోటీలు



స్కేటింగ్ పోటీలు

ఏరియా ఆసుపత్రిలో బాలింత మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆవేదన

రక్తహీనతే కారణం : ఆసుపత్రి సూపరింటెండెంట్ పద్మజారాణి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని పోతురెడ్డిపల్లి గ్రామానికి చెందిన బాలింత ఉషారాణి నూజివీడు ఏరియా ఆసుపత్రిలో మృతి చెందింది. ఆమె మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని మృతురాలి భర్త, బంధువులు ఆరోపిస్తున్నారు. మంగళవారం మృతురాలి భర్త బాలయ్య, ఆదివడుమ రిగ్గా స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 19వ తేదీన ఆదివారం ఉషారాణికి పురిటి నొప్పులు రావడంతో నూజివీడు ఏరియా ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆదేరోజు మగ బిడ్డకు జన్మనిచ్చి ఉషారాణి ఎంతో ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉందన్నారు. అల్పాహారం, భోజనం చేసి పాలు కూడా సేవించినట్లు తెలిపారు. ఒక్కసారిగా నీరసించిపోవడంతో ఉషారాణికి రక్తం తక్కువైందని, తాము చెప్పిన బ్లడ్ బ్యాంకు నుంచి రక్తం తీసుకురావాలని వైద్యులు తెలిపినట్లు మృతురాలి భర్త బాలయ్య చెప్పాడు. తన గ్రూపు, నా భార్య ఉషారాణి గ్రూపు ఓ పాజిటివ్ కావడం వల్ల తానే బ్లడ్ ఇస్తానని చెప్పినా వైద్యులు వినిపించుకోలేదని బాలయ్య వాపోయారు. వైద్యులు సూచించిన బ్లడ్ బ్యాంకు విజయవాడ నుంచి బ్లడ్ యూనిట్లను తీసుకొచ్చినట్లు చెప్పారు. ఆదివారం తీసుకొచ్చిన రక్తాన్ని సోమవారం ఎక్కిస్తుండగా తన భార్య ఉషారాణి ఊపిరి తీసుకోలేక ఇబ్బంది పడిందని, దీంతో సమీపంలోని నర్సులకు సమాచారం ఇచ్చినా స్పందించపోగా విసుగు వ్యక్తం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటికి వైద్యులు అందుబాటులో లేరని, వైద్యులు వచ్చేసరికి తన భార్య ఉషారాణి పల్స్ తగ్గుతూ రావడంతో ఆరోగ్యం మరింత క్షీణించినట్లు తెలిపారు. హుటాహుటిన విజయవాడ తీసుకెళ్లమన్నారని, ప్రభుత్వ అంబులెన్స్ ప్రయత్నించగా ఫలితం లేకపోవడంతో ప్రైవేట్ అంబులెన్స్‌ను పిలిపించినట్లు చెప్పారు. ప్రైవేట్ అంబులెన్స్ వచ్చిన తర్వాత అవి వద్దని, ప్రభుత్వ అంబులెన్స్‌లో తీసుకెళ్లాలని సుమారు రెండు గంటల సమయం గడిచిన తర్వాత వైద్యులు, సిబ్బంది చెప్పడంతో చేసేది లేక ఉషారాణిని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. పరీక్షించిన అక్కడి వైద్యులు అప్పటికే ఉషారాణి మృతి చెందినట్లు నిర్ధారించారు. వైద్యంలో నిర్లక్ష్యం వహించిన డాక్టర్లను ప్రశ్నించేందుకు తిరిగి నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చినట్లు బాలయ్య వివరించారు. సమయానికి రాని వైద్యులు ఆసుపత్రిలోనే ఉన్నట్లు చెప్పడం దారుణమని, తన ముగ్గురు కుమార్తెలు, కుమారుడు తల్లి లేక అనాథలు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించే స్తోమత లేక ప్రభుత్వాసుపత్రికి వస్తే, ఆరోగ్యంగా ఉన్న తన భార్య ఉసురు తీశారని వాపోయారు.

రక్తహీనతే ఉషారాణి మృతికి కారణం

ఏరియా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ జి.పద్మజారాణి

నూజివీడు ఏరియా ప్రభుత్వాసుపత్రిలో ప్రసవించిన తల్లి ఉషారాణి మృతికి రక్తహీనతే కారణమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.పద్మజారాణి తెలిపారు. ఆమె మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వైద్యులు అందుబాటులో ఉన్నారని, ఎప్పటికప్పుడు ఉషారాణికి వైద్యం అందించారని చెప్పారు. సాధారణ వైద్య సేవలకు గత నెలలో వచ్చినప్పుడు రక్తహీనత ఉండడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతాయని ముందుగానే హెచ్చరించినట్లు తెలిపారు. ఈ ఆదివారం ప్రసవ సమయంలో ఆసుపత్రికి వచ్చిన సందర్భంలో రక్తహీనతతో తలెత్తబోయే ఇబ్బందులను ముందుగానే సూచించామని, కుటుంబ సభ్యుల సమ్మతితో వైద్య సేవలందించామని తెలిపారు. రక్తహీనత కారణంగానే ఉషారాణి మృతి చెందిందని చెప్పారు.

విద్యార్థులకు పలు పోటీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని అన్నవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు స్కూల్ పరిధిలో నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి తెలిపారు. వ్యాసరచనలో ప్రథమ బహుమతి సాత్విక్, ద్వితీయ బహుమతి లక్ష్మీప్రసన్న, తృతీయ బహుమతి నాగ వెంకట భానుశ్రీ సాధించారు. వక్తృత్వ పోటీల్లో ప్రథమ బహుమతి సూర్య, ద్వితీయ బహుమతి లక్ష్మీశ్రీనివాస్, తృతీయ బహుమతి చైతన్య లక్ష్మి సాధించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రచించడానికి రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు పట్టిందని తెలిపారు. 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిందన్నారు. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు నాగరాజు మాట్లాడుతూ స్కూల్ పరిధిలో విజేతలు ఈ నెల 24, 25 తేదీల్లో మండల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేంద్రరావు, నాగరాజు, దుర్గా మల్లేశ్వరరావు, ఫిలోమిన, జాస్మిన్, బివివిఎస్‌వి.ప్రసాద్, రాజేంద్రప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ రవీంద్ర పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

మోటార్ సైకిల్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎపి గుంట పంచాయతీ లింగమ్మగూడెం గ్రామానికి చెందిన కుంజా సోమరాజు (49) రెండేళ్ల నుంచి టి.నరసాపురం గ్రామంలోని పలనాని వెంకటేశ్వరరావుకు కొబ్బరికాయలు కోయడానికి వెళ్తున్నాడు. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం సోమరాజు, వగ్గాల ప్రేమ్‌కుమార్‌తో కలిసి బైక్‌పై కొబ్బరికాయలు కోయడానికి బయలుదేరాడు. గుర్వాయిగూడెం గ్రామ శివారు మలుపు వద్దకు వచ్చేసరికి మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన పాకా బలరామ్ మోటారుసైకిల్‌పై అతి వేగంగా హారన్ కొట్టకుండా వచ్చి ఢీ కొట్టడంతో సోమరాజు తలకు గాయమైంది. ఆయనను కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌లో చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుని భార్య కుంజా దుర్గ ఫిర్యాదు మేరకు టి.నరసాపురం ఎస్ఐ ఎం.జయబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఓ మహిళ అదృశ్యమైన సంఘటన మండలంలోని పెయ్యేరులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కోటి రమ్య(36) తన భర్త రవితో మనస్పర్ధలు వచ్చి పుట్టింటి వద్దనే ఉంటుంది. రమ్య బంధువు దివ్య అనారోగ్యంతో విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఆమెకు సహాయం చేసే నిమిత్తం రమ్యను రమ్మని కబురు చేయడంతో ఈ నెల 18వ తేదీ ఉదయం 11:30 గంటల సమయంలో బంధువులు రమ్యను తీసుకొచ్చి ముదినేపల్లి బస్టాండ్‌లో దింపి వెళ్లారు. అయితే ఆమె విజయవాడ చేరుకోలేదని, ఆమె గురించి వెతికినా ఆచూకీ లభ్యం కాలేదని బంధువులు ఇచ్చిన రిపోర్టుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరభద్రుడు తెలిపారు.

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం షాపుల్లో, బార్ అండ్ రెస్టారెంట్‌లలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎపి ఎక్సైజ్ సురక్షా యాప్ ద్వారా మద్యం బాటిల్స్‌ను స్కాన్ చేసి విక్రయించాలని, ఎక్సైజ్ షాపు, బార్ రూల్స్‌లను తప్పనిసరిగా పాటించాలని ఎక్సైజ్ సిఐ అశోక్ సూచించారు. చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని లింగపాలెం మండలం గ్రామంలో ఆయన దాడులు చేశారు. ఈ దాడిలో లింగపాలెం మండలం వేములపల్లి గ్రామానికి చెందిన మహిళ నత్తా రాములమ్మను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి లీటరు నాటు సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం, తలార్లపల్లి గ్రామాల్లో పాత నాటు సారా కేసుల్లో నిందితులుగా ఉన్న ఇద్దరు మహిళలు ఇస్లావతు మారోని, వడిత్యా పున్నాలను 129 బిఎన్ఎస్ఎస్ చట్టం ప్రకారం మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ తహశీల్దార్ వారి ఎదుట హాజరు పర్చగా బైండోవర్ బాండ్ విధించారు. ఈ దాడుల్లో చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐలు అబ్దుల్ ఖలీల్, జె.జగ్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా టపాసుల విక్రయం

ఇద్దరు వ్యక్తులు అరెస్టు

ప్రజాశక్తి - ముదినేపల్లి

అనుమతులు లేకుండా టపాసులు విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిగురుకోటలో ఈ నెల 20వ తేదీ సాయంత్రం సుమారు ఆరు గంటల సమయంలో ఎస్ఐ తమ సిబ్బందితో చిగురుకోట గ్రామం వెళ్లారు. అక్కడ ఎటువంటి అనుమతులు లేకుండా దింటకుర్తి బాలకృష్ణ, దింటకుర్తి సత్యనారాయణమూర్తి ఎటువంటి జాగ్రత్తలు లేకుండా రోడ్డు పక్కన టపాసులు పెట్టి అమ్ముతున్నారని వారిద్దరిపై కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.24,320 విలువైన టపాసులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

8 మంది జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఒకే చోట నిర్వహిస్తున్న పేకాట, కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి బైక్‌లు, నగదు, కోడిపంజులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాచుగుంటలో ఒకే చోట పేకాట, కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు నిడమర్రు సిఐ రజనీకుమార్ ఆధ్వర్యంలో నిడమర్రు ఎస్ఐ (చేబ్రోలు ఇన్‌ఛార్జి) ఎస్ఎన్‌విఐ.రమేష్, చేబ్రోలు పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి మూడు బైక్‌లు, రూ.ఎనిమిదిఉ వేల నగదు, రెండు కోడిపుంజులు, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ప్రజలు 9440796657 నెంబర్‌కు సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఇన్‌ఛార్జి ఎస్ఐ రమేష్ తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ముదినేపల్లి

కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఇద్దరికి అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు, కోడిపుంజులు, కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిగురుకోట గ్రామంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ వీరభద్రుడు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో కోడిపందేలు వేస్తున్న మండవల్లి మండలం పెరికేగూడేనికి చెందిన నరదల శివనాగరాజు, వీరగాని పాండురంగారావులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,200 నగదు, రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ వి.క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... జీలుగుమిల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ క్రాంతికుమార్ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,440 నగదు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు. వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - టి.నరసాపురం

అక్రమ మద్యం కలిగి ఉన్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ సిఐ పి.అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రమైన టి.నరసాపురం పంచాయతీలోని మెట్టగూడెం గ్రామంలో బెల్ట్ షాపుల నిర్వాహకులపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో బైగాని సూర్యనారాయణవద్ద ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. ఈ దాడుల్లో చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐలు అబ్దుల్, జె.జగ్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

చింతలపూడి ఎంఎల్ఎ రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

నియోజకవర్గ అభివృద్ధి, విజన్ ప్లాన్ అమలుపై అధికారులు దృష్టి సారించాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అధికారులకు సూచించారు. కామవరపుకోట ఎంపిడిఒ కార్యాలయంలో విజన్ యాక్షన్ ప్లాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ మొదటి సంవత్సరం ఆరు ప్రధాన రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వ్యవసాయంతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకుమంచి అవకాశాలున్నాయని, వనరులను వినియోగించుకుని అభివృద్ధి దిశగా చింతలపూడి నియోజకవర్గాన్ని ముందుకు తీసుకువెళ్లాలన్నారు. పర్యాటక ప్రదేశాలను, పర్యాటకులు బస చేసేందుకు మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలన్నారు. పేదరిక నిర్మూలన కోసం ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచే విధంగా, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామాల్లో సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో విజన్ ప్లాన్ యాక్షన్ రెడీ చేయాలని, అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మ్యాజిక్ డ్రెయిన్ పరిశీలన

ప్రజాశక్తి - ఉంగుటూరు

జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన మ్యాజిక్ డ్రెయిన్ పనులను ఉంగుటూరు మండలం కంసాలికుంటలో ఎంపిడిఒ రాజ్ మనోజ్ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టడం వల్ల గ్రామాల్లో ఉన్న మురుగునీరు వడ కట్టబడి భూమి లోపలికి చేరి భూగర్భ జలాలు కూడా పెరిగే అవకాశం ఉందని, దోమల నివారణ కూడా జరుగుతుందని తెలిపారు. వంద మీటర్ల సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి సుమారు రూ.ఐదు లక్షలు ఖర్చయితే వంద మీటర్ల మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణానికి సుమారు రూ.లక్ష నుంచి రూ.1.40 లక్షలు ఖర్చవుతుందని, తద్వారా ఖర్చు కూడా తగ్గుతుందని చెప్పారు. గ్రామాల్లో ఉన్న మురుగునీటి వ్యవస్థకు మ్యాజిక్ డ్రెయిన్లు మంచి పరిష్కార మార్గమని తెలిపారు. ఈ పైలెట్ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత, ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు మండలంలో అవసరమైన మేర మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. వారితో పాటు ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి. కంసాలికుంట సర్పంచి, తదితరులు పాల్గొన్నారు.



డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

మనోజ్‌కుమార్‌కు పోలీసుల నివాళి

ప్రజాశక్తి - కలిదిండి

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నక్సల్స్ దాడిలో ప్రాణాలర్పించిన మండలంలోని మూలలంకకు చెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ కర్రి మనోజ్‌కుమార్ స్మారక విగ్రహం వద్ద కైకలూరు రూరల్, టౌన్ పోలీస్ సిబ్బంది నివాళులర్పించారు. కర్రి మనోజ్‌కుమార్ తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్‌జియుకెటిలో ఘనంగా దీపోత్సవం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

దీపావళిని పురస్కరించుకుని ఆర్‌జియుకెటి నూజివీడు డిఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో దీపోత్సవ్ 2025 కార్యక్రమాన్ని గ్రౌండులో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఐదున్నర గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, నూజివీడు డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్ర కుమార్, పరిపాలనాధికారి డాక్టర్ బి.లక్ష్మణరావు, అకాడమిక్ డీన్ డాక్టర్ సాదు చిరంజీవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డైరెక్టర్ పరిపాలనా అధికారులు గ్రౌండ్లో విద్యార్థులు ఏర్పాటు చేసిన దీపోత్సవ్ స్టాళ్లను సందర్శించారు. అనంతరం ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ క్యాంప్‌ఫైర్ వెలిగించి వేడుకలకు శ్రీకారం చుట్టి చెడుపై మంచి గెలిచిన దీపావళి ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం బాణసంచా ప్రదర్శనను పండుగ ఉత్సాహన్ని పెంచేందుకు చిన్నపాటి ఫైర్‌వర్క్స్‌ను ప్రదర్శించారు. విద్యార్థులు, సిబ్బంది, అధ్యాపకుల కోసం ఓపెన్-ఫ్లోర్ దాండియా ఏర్పాటు చేశారు. మ్యూజిక్, కల్చరల్ కమిటీ ద్వారా ఏర్పాటు చేసిన సంగీతం, నృత్యం, నాటకాలు, ఇతర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దీపోత్సవం సందర్భంగా విద్యార్థులు విభాగాల వారీగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. వాటిలో ఉత్తమంగా ఉన్న వాటికి డైరెక్టర్ బహుమతులు అందించారు. ఈ స్టాల్స్ నిర్వహణలో ఇసిఇ ప్రథమ బహుమతి, ఇఇఇ ద్వితీయ బహుమతి, పియుసి తృతీయ బహుమతిని సాధించగా ఎఎంఇ డిపార్ట్‌మెంట్ విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతి లభించింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనాథ్, డాక్టర్ దుర్గాభవాని, సురేష్, డాక్టర్ గౌతమి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు బాలరాజు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని అన్నవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బాలరాజు జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 వాలీబాల్ డివిజన్ పరిధిలో విసన్నపేట మండలంలోని నరసాపురంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సెలక్షన్స్‌లో బాలరాజు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయులు విజయకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని తెలిపారు. క్రీడలు శారీరక మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు మూడు శాతం రిజర్వేషన్ కల్పించిందని తెలిపారు. ఈ నెల 22వ తేదీన ఎన్‌టిఆర్ స్టేడియం గుడివాడలో జరిగే జిల్లా సెలక్షన్స్‌లో బాలరాజు పాల్గొంటాడని ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు. భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు నాగరాజు మాట్లాడుతూ క్రీడలకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, ప్రతిభ గల క్రీడాకారులను తాను వ్యక్తిగతంగా ప్రోత్సహిస్తానని చెప్పారు. తెలుగు ఉపాధ్యాయని మంగలక్ష్మి క్రీడాకారుడు బాలరాజును మెమెంటోతో సత్కరించారు. తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు రవీంద్రను, క్రీడాకారులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేంద్రరావు, నాగరాజు, దుర్గామల్లేశ్వరరావు, ఫిలోమిన, శ్రీ మంగలక్ష్మి, జయకుమారి, జాస్మిన్, వెంకటరమణ, బివివిఎస్‌వి.ప్రసాద్, రాజేంద్రప్రసాద్, కృష్ణకుమారి పాల్గొన్నారు.



బాలరాజును అభినందిస్తున్న ప్రముఖులు

రీసర్వే వేగవంతం చేసి మంచి ఫలితాలు సాధించాలి

జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ

ప్రజాశక్తి - పెదపాడు

మూడో విడత రీసర్వే వేగవంతం చేసి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ చెప్పారు. మండలంలోని పునుకొల్లు గ్రామంలో రీ సర్వేలో భాగంగా గ్రౌండు ట్రూత్కింగు సర్వే పనులు ఆయన రైతులతో కలిసి స్వయంగా వరి పొలాల్లోకి వెళ్లి పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పనులు ఎలా జరుగుతున్నాయని, ఏమైనా ఇబ్బందులు ఉంటే చెప్పాలని అన్నారు. పనులు మా సమక్షంలోనే బాగా జరుగుతున్నాయని రైతులు చెప్పడంతో జెసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో అక్టోబర్ మూడో తేదీ నుంచి మూడో విడత రీ సర్వే పనులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఏలూరు జిల్లాలో మొదటి, రెండు విడత గ్రామాల్లో రీ సర్వే విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. అక్టోబర్ మూడో తేదీ నుంచి మరో 59 గ్రామాల్లో రీ సర్వే 60 పని దినాల్లో పూర్తి చేశామని చెప్పారు. రైతులందరూ సహకరించాలని, రెవెన్యూ సిబ్బంది మీ భూమి ఎప్పుడు సర్వే చేస్తారో ముందుగా మీకు నోటీసు ద్వారా తెలియపరుస్తారని తెలిపారు. మీ భూమిని రీ సర్వే చేసే సమయంలో రైతులు హాజరై సహకరించాలన్నారు. సర్వే పూర్తయిన అనంతరం ఏ రైతు భూమి ఎంత ఉందో నోటీసు ద్వారా రైతులకు తెలియజేయనున్నట్లు తెలిపారు. అభ్యంతరాలు ఉంటే స్పష్టమైన సమాచారాన్ని సంబంధిత శాఖలు అధికారులకు రైతులు ఇవ్వాలని జెసి సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వే ఎడి అన్సారీ, తహశీల్దార్ ఎ.కృష్ణజ్యోతి, మండల సర్వేయరు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణతో ప్రజా ఉద్యమానికి శ్రీకారం

పోలవరం మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కోటి సంతకాల సేకరణతో ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు పోలవరం మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని పి.అంకంపాలెం గ్రామంలో నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలువురితో సంతకాలు చేయించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండలాధ్యక్షులు సందా ప్రసాద్, జెడ్‌పిటిసి సభ్యులు వసంతరావు, వైస్ ఎంపిపి ఎస్.శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, లలితకుమారి, మాజీ సర్పంచి కోర్స వెంకటేశ్వరావు, నాయకులు రాముడు, బోధా శ్రీనివాస్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం :వైద్య కళాశాలల ప్రయివేటీకరణను నిరసిస్తూ వైసిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి కుక్కల ధర్మరాజు సారథ్యంలో చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంభం విజయరాజు, రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు నాయకత్వంలో పట్టణంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. జంగారెడ్డిగూడెం కొత్త బస్టాండ్ వద్ద కోటి సంతకాల సేకరణ ఉద్యమం, రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కర్పూరం గుప్త, యువ నాయకులు జెట్టి సత్య, ఆదిత్య, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ముప్పిడి శ్రీనివాసరావు, పట్టణ మాజీ అధ్యక్షులు పిపిఎన్.చంద్రరావ పాల్గొన్నారు.

యాత్రికులు జాగ్రత్తలు తీసుకోవాలి

కార్తీకమాసం నేపథ్యంలో గోదావరి రేవులను పరిశీలించిన పోలవరం ఎస్ఐ

ప్రజాశక్తి - పోలవరం

కార్తీక మాసం సందర్భంగా గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించే యాత్రికులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలవరం ఎస్ఐ ఎస్ఎస్.పవన్‌కుమార్ సూచించారు. మండలంలోని పట్టిసీమ, గూటాల, నూతనగూడెం, పాత పట్టిసీమ, పోలవరం ప్రాంతాల్లో ఉన్న గోదావరి రేవులను ఎస్ఐ పవన్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పవన్‌కుమార్ మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లో స్నానం చేసే యాత్రికులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పిల్లలు, వృద్ధులు ఒంటరిగా నదిలోకి దిగరాదని హెచ్చరించారు. అనుమతి ఇచ్చిన రేవుల్లో మాత్రమే స్నానాలు ఆచరించాలని కోరారు. తెల్లవారుజామున గోదావరి నదిలో స్నానాలు ఆచరించేవారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. యాత్రికుల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, కార్తీక మాసంలో రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున పోలీసులు ప్రత్యేక పహారా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. యాత్రికులకు అనుమతించిన గోదావరి నది రేవుల వద్ద లైట్లను, ఇసుక బస్తాలను పోలవరం సర్పంచి పొడుం పుష్ప ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టిసీమ పంచాయతీ కార్యదర్శి యు.రాజారావు, పట్టిసీమ ఫెర్రీ రేవు కాంట్రాక్టర్ మణికంఠ, కానిస్టేబుల్ కోటి పాల్గొన్నారు.

యాత్రికులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

బలివే ఆలయ కార్య నిర్వహణాధికారి సీతారామయ్య

ముసునూరు :కార్తీక మాసం సందర్భంగా తమ్మిలేరు నది స్నానాల విషయంలో యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా భారీ కేడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు బలివే ఆలయ కార్య నిర్వహణ అధికారి పామర్తి సీతారామయ్య తెలిపారు. కార్తీక మాసంలో బలివే వచ్చే యాత్రికులు స్నానాలు ఆచరించేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శివకుమార్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

విద్యార్థులకు ప్రభుత్వం విద్యను దూరం చేస్తూ కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేసేందుకు ప్రయివేట్‌పరం చేస్తుందని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.శివకుమార్ విమర్శించారు. నూజివీడులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా రాష్ట్రంలోని మెడికల్ కళాశాలలను ప్రయివేట్‌పరం చేసే పిపిపి విధానాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. స్థానిక అమర్‌భవన్ సిపిఐ కార్యాలయంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 22 నుంచి నవంబర్ 12వ తేదీ వరకు ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు జరిగే బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ నూజివీడులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో సమీపంలోని అనేక గ్రామాల నుంచి విద్యను అభ్యసించడానికి నూజివీడు వస్తున్న విద్యార్థులు ప్రయివేట్ కళాశాలలకు సొమ్ము చెల్లించలేక తమ చదువులకు మధ్యలోనే స్వస్తి పలుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూజివీడులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కోసం బాటలు వేయాలని కోరారు. విద్యార్థులు ఉండడానికి శాశ్వత ప్రభుత్వ వసతి గృహాలు లేకపోవడంతో అద్దె గదుల్లో ఉంటూ చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నూజివీడు మండల నాయకులు సంతోష్, భాను, కార్తీక్, ప్రేమ్, అరవింద, వరుణ్, కన్నా, గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF II ADDITIONAL SENIOR CIVIL JUDGE, VISAKHAPATNAM

E.A. 243/2023 in E.P. 30/2014 in O.S. 477/2007

Between:

Sri Padala Srinivasa Reddy ...Petitioner/D.Hr.

And

Sri Kalidindi Kasi Viswanadha Raju ...Respondent/J.Dr.

To

Respondents/proposed J.Drs.2 & 3:

2) Kalidindi Alivelu Manga Devi, w/o. late Kalidindi Kasi Viswanadha Raju, residing at Vempa Village, Mogalthuru Mandal, West Godavari district.

3) Kalidindi Varma, s/o. late Kalidindi Kasi Viswanadha Raju, residing at Vempa Village, Mogalthuru Mandal, West Godavari district.

Please take notice that the above petitioner/D.Hr. filed the above E.A. against both of you and the matter is coming for your appearance in the above proceedings and stands posted to **03-11-2025,** on that day both of you should personally or through Advocate attend before the above said Hon'ble Court at 10-30 A.M. failing which the matter will be heard and determined in your absence ex parte as per law.

(By order of the Hon'ble Court)
Tatavarthy Law Chambers (TLC)
T.V.S.K. KANAKA RAJU
M.A.S.PRABHA, Advocates
Visakhapatnam, Ph: 0891-2755164

'పేదలకు ఆసరాగా సిఎంఆర్‌ఎఫ్'

ప్రజాశక్తి - చింతలపూడి

ఆపదలో ఉన్న ఎంతోమందికి సిఎం రిలీఫ్ ఫండ్ ఆసరాగా ఉంటుందని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఆయన క్యాంపు కార్యాలయం వద్ద రూ.6,38,156 విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రోషన్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత నియోజకవర్గంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ఎక్కువగా అందించి కుటుంబాలకు కొంత భరోసా కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - ముసునూరు

మండల పరిధిలోని ముసునూరు బిసి కాలనీకి చెందిన టిడిపి కార్యకర్త మానికల నాగేంద్రరావు (42) ఇటీవల గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ముసునూరు సర్పంచి తనయుడు, తెలుగు యువత నియోజకవర్గ కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్(బాబి) స్థానిక నాయకులతో కలిసి పరామర్శించి రూ.ఐదు వేల నగదు ఆర్థిక సాయం అందించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి తోట శ్రీను, మానికల శ్రీను, నక్క యోహాన్, ఎంపిటిసి మాజీ సభ్యులు ఆటో సాంబయ్య, నాయకులు పాల్గొన్నారు.

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలు వర్తింపచేసేలా చర్యలు చేపడతానని చెప్పారు.

IN THE COURT OF THE I ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) TANUKU

I.A.No. 197/2025 in O.S.No. 385/2024

Between:

Putta Murali Ramakrishna ...**Petitioner/Plaintiffs**

And

Katlaparthi Rama Rao (Died) & Others ...**Defendants/Respondents**

R2 : Katlaparthi Suryanarayana, S/o. Late Rama Rao, D.No. 12-63-5/1, Avinesh Residency, Flat No. 404, Peacock Lodge side street, Old Town, near by - pass road, Tanuku, W.G. Dt, TJCJC, Cell No. 9866506118, No e-mail address.

వాది మరియు పిటీషనర్ తరపున వేయించిన ప్రకటన

ఇందుమూలముగా 2వ రెస్పాండెంట్ పై I.A.No: 197/2025రు L.R. పిటీషనులో కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు నోటీసు పేపరు ప్రకటన ద్వారా ఆర్డరు వేసియున్నారు. కావున **ది. 07-11-2025 వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, లాయరు ద్వారా గానీ హాజరు అయి అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షములో పిటీషను విచారణ చేసి తీర్మాణం చేయబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

గుడిమెట్ల వీర్రెడ్డి
పిటిషనరు తరపు న్యాయవాది
తణుకు
సెల్: 94406 07793

తణుకు
ది. 21-10-2025